క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



మహాముత్తారం: మండలంలోని దొబ్బల్‌పాడ్ మోడల్ పాఠశాలలో 10వ తరగతిలో 9.3జీపీఏ సాధించిన సమీర, శరణ్య, స్పందన అనే విద్యార్థులను పాఠశాలలో గురువారం ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఎంపీఓ శ్రీనివాసరావు శాలువాలతో సన్మానించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

జాబితా ప్రచురణ

మల్హర్: మండలంలోని తాడిచర్ల, కాపురం గ్రామాలకు చెందిన మైనర్ టూ మేజర్ ఆర్ అండ్ఆర్ తుది జాబితాను కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీపీ ఏర్పాటులో భాగంగా కాపురం, తాడిచర్ల గ్రామల్లో ఆర్అండ్ఆర్ జాబితాలో నోటిఫికేషన్ నాటికి 18 సంవత్సరాలు నిండిన లబ్ధిదారులకు ప్రస్తుతం 18 సంవత్సరాలు నిండిన లబ్ధిదారులను అధికారులు గుర్తించినట్లు వివరించారు. కాపురంలో 18, తాడిచర్ల ఎస్సీకాలనీలో 36 మంది పేర్లతో కూడిన జాబితాను కార్యాలయాల్లో ప్రచురించినట్లు తెలిపారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

పనులు ప్రారంభం



మహాముత్తారం: గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం గిరివికాస పథకంలో భాగంగా మండలంలోని బొగ్గులపల్లి గ్రామంలోని గిరిజన రైతులకు 12 బోరు బావులు మంజూరయ్యాయి. గురువారం బొగ్గులపల్లి గ్రామంలోని రైతులకు బోరుబావి నిర్మాణానికి సర్పంచ్ దూలం మల్లయ్య టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబాను అరికట్టాలని వినతి



చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామంలో గుడుంబాను అరికట్టాలని గ్రామానికి చెందిన యువకులు సర్పంచ్ కామిడి రత్నాకర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. గుడంబా తాగి చాలా మంది మృతి చెందుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బయగాని వెంకటేష్, సందిప్, విగ్నేష్, నిరంజన్, మేరుగు ఉదయ్, తరుణ్, సాయి, మనిగంటి వేమంత్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మహదేవపూర్: మండలంలోని బెగుళూర్ మాజీ సర్పంచ్ ఆకుల నారాయణ ఇటీవల మృతి చెందాడు. దీంతో పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్టమధు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జక్కు రాకేష్ మృతుడి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా పేద్దంపేట గ్రామానికి చెందిన పటేల్ సమ్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీపతి బాపు, కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత మనోహర్, ఎంపీటీసీ చల్ల పద్మ ఒదేల్, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ఎండీ ఆలిం ఖాన్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



టేకుమట్ల: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై చల్లా రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాదరులకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కాటారం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ స్వామి



టేకుమట్ల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామకృష్ణ

కాటారం: మండలంలోని ప్రతాపగిరిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దబ్బెట స్వామి గురువారం ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటి లక్ష్మి, డైరెక్టర్లు ఐలి రాజబాబు, జక్కుల అజయ్‌కుమార్, రైతులు రాజయ్య, తిరుపతి, రాజయ్య, సీఈఓ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హమలీల సంఘం నాయకులు చిన్న నరసయ్య రాజు, ఓదెలు, రాములు, తిరుపతి, వెంకటేష్, శ్రీకాంత్, శంకరయ్య ,రాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఏటూరునాగారం: ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని కొమురంభీం నగర్‌లో ఆదివాసీలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 2005 అటవీ హక్కుల చట్టం రాకముందు నుంచే ఈ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుంటూ అనేక పర్యాయాలు అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువచ్చామని, అరెస్టులు జరిగి జైలుకు కూడా వెళ్లారన్నారు. ఆ సందర్భంలో జరిగిన సర్వేలలో సాగులో ఉన్న భూమిని తగ్గించి, కావాలని రిజెక్ట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అయినా ఆదివాసీ గిరిజనులు అక్కడే ఉంటూ పోడుభూములలో సాగులోనే ఉంటున్నారన్నారు. ఇవ్వాల, రేపు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారమే తప్ప పోడుభూముల పట్టాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం శాటిలైట్ సర్వే కాకుండా సాగులో ఉన్న ప్రతీ భూమికి కూడా పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ ఏటూరునాగారం మండల కార్యదర్శి నాసర్, గిరిజన సంఘం నాయకులు, పొదెం ఉంగయ్య, ఇరుప కృష్ణ, పొదెం రాంబాబు, కురుసం లింగయ్య, పుల్లమ్మ, మడకం పాపారావు, రమేష్, లక్ష్మి, సుశీల, రాజు, పథం లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాత్కాలిక పంచాయతీ కార్యదర్శుల నియామకం



ఉద్యోగులతో మాట్లాడుతున్న అప్పయ్య

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు ఇతర శాఖలో పనిచేస్తున్న 11 మందిని తాత్కాలిక గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలను అప్పగించినట్లు డీఎంహెచ్ఓ, మండల స్పెషల్ ఆఫీసర్ అలెం అప్పయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు నేటి (శుక్రవారం) నుంచి తాత్కాలికంగా పంచాయతీ కార్యదర్శులుగా విధుల్లోకి చేరాలని తెలిపారు. గ్రామ పంచాయతీలలో తమ విధులతో సమానంగా శానిటేషన్ పనులు, గ్రామ పంచాయతీ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలిక బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీఓ శ్రీధర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులను గూడెంలోకి రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

ఎస్ఎస్ తాడ్వాయి: అనుమానిత వ్యక్తులను గూడెంలోకి రానివ్వొద్దని ఎస్సై వెంకటేశ్వరరావు గొత్తికోయలకు సూచించారు. గురువారం మండలంలోని అన్నారం సమీపంలోని గొత్తికోయగూడెంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గూడెంలో ఎన్ని గొత్తికోయ కుటుంబాలు నివసిస్తున్నాయని ఆరా తీశారు. అనంతరం ఆయన గొత్తికోయలతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అసాంఘీక శక్తులకు సహకరించవద్దని వారిని దరిదాపుల్లోకి కూడా రానియోద్దని హెచ్చరించారు. గొత్తికోయల అమాయకత్వాన్ని అసరా చేసుకొని మావోయిస్టులు వారి సహాయ సహకారాలను వినియోగించుకునేందుకు గూడెంలోకి వస్తారని వారికి ఎలాంటి సహకారం అందిచకూడన్నారు. ఎవరైనా వారికి సాయం అందించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నపిల్లలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై–2 శ్రావణ్‌కుమార్, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



మాట్లాడుతున్న అనంతరెడ్డి

ములుగు రూరల్(గోవిందరావుపేట): నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి పట్టాలు అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి యానాల అనంతరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని పస్రా శివారులోని ప్రభుత్వం భూమిలో గుడిసెలు వెసుకున్న వారిని కలిసి మాట్లాడారు. ఉపాధి కోల్పోయిన మావోయిస్టు కుటుంబాలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు దారావత్ దేవానాయక్, శివప్రసాద్, జంపాల సత్యనారాయణ, గుడిసెవాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ప్రయాణికుడి బ్యాగును సోదా చేస్తున్న సీఐ



కారును సోదా చేస్తున్న పోలీసులు

వాజేడు: మండలంలోని 163 నంబర్ జాతీయ రహదారిపై వెంకటాపురం(కె) సీఐ కాగితోజు శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పేరూరు పోలీసులు ముమ్మర తనిఖీలను నిర్వహించారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామం సమీపంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆపి సోదాలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన పత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్‌లను చూశారు. పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే చట్ట పరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

పరామర్శ



రమణయ్యను పరామర్శిస్తున్న నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్యను బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయి మండల పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ, సునీల్‌కుమార్, సమ్మయ్య, మల్లయ్య, మంగపేట మండల ఇన్‌చార్జ్ తుమ్మ మల్లారెడ్డి, ఎంపీటీసీలు సుమలత రమేష్, స్వప్న చంద్రబాబు, నాయకులు సమ్మిరెడ్డి, సమ్మయ్య, తిరుపతి, తాడ్వాయి ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, శ్రీహరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటేష్

ములుగు రూరల్(గోవిందరావుపేట): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని పస్రాలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు వారాల నుంచి కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే ప్రభుత్వం పరిష్కరించడం మాని విధుల నుంచి తొలగిస్తానని అనడం సరికాదని అన్నారు. ప్రొబిషన్ పిరియడ్ కాలపరిమితి ముగిసిన తరువాతే పంచాయతీ కార్యదర్శులు క్రమబద్ధికరించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. కార్యదర్శులకు డీవైఎఫ్ఐ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నం ప్రవీణ్, సంజీవ, జీవన్, వేడు, అరుణ్, శ్రావన్, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఏటూరునాగారం: ఐటీడీఏలో డైలీవేజ్ ఎలక్ట్రీషియన్ ఉద్యోగిగా పనిచేస్తున్న అలిమొద్దీన్ బుధవారం రాత్రి హనుమకొండ నుంచి ఏటూరునాగారం వస్తుండగా పస్రా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడని తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అలిమొద్దీన్ భార్య ఫర్హత్ అధికారులను గురువారం వేడుకున్నారు. కార్యాలయంలో గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని తనకు కుటుంబానికి ఎవరు అండ అని మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన ఐటీడీఏ డ్రైవర్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌ను వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తన భర్త ఆస్పత్రిలో ఉన్నారని, తమను ఆదుకోవాలని శ్రీనివాస్ భార్య రేణుక అధికారులను వేడుకున్నారు.

విచారం వ్యక్తం చేసిన పీఓ..

కార్యాలయంలో ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ విధి నిర్వాహణలో భాగంగా అసువులు బాసిన అలిమొద్దీన్ మృతి వార్త విన్న ఐటీడీఏ పీఓ అంకిత్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మశాంతించాలని కోరారు. అలిమొద్దీన్ దహన సంస్కారాలకు ఏపీఓ వసంతరావు, పీహెచ్ఓ రమణ, డీఎస్ఓ లాల్‌నాయక్, తదితరులు వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు.

అలిమొద్దీన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఐటీడీఏ కార్యాలయంలో డైలీవేజ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అలిమొద్దీన్ కుటుంబాన్ని ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబంలో వారసుడికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో దూడ మృతి



వెంకటాపురం(ఎం): విద్యుదాఘాతంతో లేగ దూడ మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బైకాని రాజయ్యకు చెందిన లేగదూడ గ్రామ శివారులో ఉదయం మేత కోసం వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు లేగ దూడ తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దూడ దాదాపు రూ.25 వేలు ఉంటుందని రైతు రాజయ్య తెలిపారు. అధికారులు నష్ట పరిహారం వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

ఉద్యోగాలు తొలగిస్తామనడం దుర్మార్గం



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం బెదిరించడం దుర్మార్గమని టీపీసీసీ సభ్యులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు మండిపడ్డారు. భూపాలపల్లి పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె గురువారంతో 14వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో సత్యనారాయణరావు పాల్గొని మాట్లాడారు. పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యదర్శులకు నోటీసులు జారీ చేయడం దురదృష్టకరమని, ప్రభుత్వం ఇలాంటి బెదిరింపులు మానుకోవాలని హితవుపలికారు. పోటీ పరీక్షలు రాసి, ఎంపిక ప్రక్రియ ద్వారా కొలువులు పొందిన వారిపైనా ప్రభుత్వం అణచివేత విధానాన్ని అవలంభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ల తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వమే ప్రకటించిందని ఆ తర్వాత మరో ఏడాది పాటు పొడిగించిందన్నారు. నాలుగేళ్ల తర్వాత కూడా కుదరదు అంటే ఎలా అని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఇటీవలే వేతన సవరణ కోరుతూ ఆందోళనకు దిగిన విద్యుత్ శాఖలోని ఆర్టిజన్లను విధుల్లోంచి తొలగించిందని గుర్తుచేశారు. ఇలా బెదిరింపులతో ఉద్యోగులను లొంగదీసుకోవడం కేసీఆర్ సర్కారుకు పరిపాటిగా మారిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎవరూ అధైర్య పడొద్దని తెలంగాణ సమాజం మొత్తం అండగా ఉంటుందన్నారు. మీ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున కొట్లాడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పిప్పాల రాజేందర్, అంబాల శ్రీనివాస్, విజయ్, రమేష్, రాజు, మహేష్ తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాజేశ్వరి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యురాలు జడల రాజేశ్వరి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన వసతిగృహాలను ప్రారంభించాలని, ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనాన్ని ఖాళీ చేయించాలన్నారు. పీజీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు చోటు, హీన, నాగమణి, లలిత, వైష్ణవి, స్వరూప, లావణ్య పాల్గొన్నారు.

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్

కాటారం: ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఉపాధి పొందాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ కూలీలకు సూచించారు. కాటారం మండలంలోని బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఎంపీడీఓ పరిశీలించారు. పని ప్రదేశం, కొనసాగుతున్న పనులు, కొలతలపై ఆరా తీశారు. జాబ్‌కార్డు కల్గిన ప్రతి కూలీ పనులకు హాజరవాలని సూచించారు. కూలి రేటు రూ.272 ఉన్నందున కొలతల ప్రకారం పని చేసి గరిష్ట కూలి పొందాలని కూలీలకు తెలిపారు. కూలీల సంఖ్య పెంచేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కృషి చేయాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ నేరేడు వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అవంతి

చిట్యాల: మండల కేంద్రంలోని కోస్గురుపల్లిలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ అవంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు, మహిళలకు తగు సూచనలు చేశారు. ఎండ తీవ్రత బాగా ఉన్నందున తల్లులందరూ పిల్లలను తీసుకొని ఫంక్షన్స్ కానీ, దూర ప్రయాణాలు కానీ వెళ్లకూడదని అన్నారు. అలాగే తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను పానీయాలను తీసుకోవాలన్నారు. బయట ఆహార పదార్థాలు కూల్ డ్రింక్స్ లాంటివి తాగించరాదని సూచించారు. అనంతరం తల్లులు, పిల్లల బరువులు ఎత్తు చూసి వయస్సుల వారీగా ఉండాల్సిన బరువు, ఎత్తుల గూర్చి వివరించారు. ఆమె వెంట సూపర్వైజర్ జయప్రద, భాగ్యలక్ష్మి, సుజాత, టీచర్స్ మహిళలు పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణకు స్థల పరిశీలన



కాటారం: క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ



మంగపేట: సమావేశంలో పాల్గొన్న అధికారులు

కాటారం: సీఎం కప్ 2023 క్రీడల నిర్వహణకు మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల క్రీడా స్థలాన్ని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ జివాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న క్రీడా సామాగ్రి, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ నెల 15 నుంచి 17 వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్న తెలిపారు. క్రీడల నిర్వహణకు పీడీలు, పీఈటీలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ చూసుకోవాలని, క్రీడాప్రాంగణంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, క్రీడలు నిర్వహించే పీఈటీలు రాధ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని కమలాపురం ఆర్ఎంసీ పాఠశాల ఆవరణలోని క్రీడా ప్రాంగణాన్ని మండల స్పెషలాఫీసర్ తుల రవి, ఎంపీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. చీఫ్ మినిస్టర్ కప్ 2023 ఆటల పోటీలను నిర్వహించేందుకు క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం క్రీడా పోటీల నిర్వాహణపై అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబా, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, శంకర్ పాల్గొన్నారు.